క్లుప్తంగా

నేటి నుంచి గాలికుంటు వ్యాధి టీకాలు

మాగనూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం నుంచి పశువైద్య, పశుసంవర్ధ కశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి రాఘవేందర్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని 15వ తేదీ నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు మండల వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యాధి బారిన పడకుండా పశుపోషకులు అందరు తప్పకుండా పశువులకు టీకాలు వేయించాలని కోరారు.

జిల్లా నూతన అధ్యక్షుడిగా తాన్‌సింగ్ ఎన్నిక



మక్తల్: నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోషియేషన్ నూతన అధ్యక్షుడిగా మక్తల్‌కు చెందిన ప్రముఖ వ్యాపార వేత్త తాన్‌సింగ్‌ను నియమించినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపాలం సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు. అనంతరం తాన్‌సింగ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా నుంచి క్రీడాకారులను తయారు చేసి జాతీయ స్థాయికి పంపిస్తామన్నారు. అందరి సహకారంతో తన వంతు పని చేస్తానన్నారు. తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మల్లారెడ్డి, విజయకాంతరావు ఆదేశాల మేరకు నియమించినట్లు తెలిపారు.

మహిబూబ్‌సుహాని ఉత్సవాలు



మద్దూరు: మండలంలోని మద్దూరు, దమగ్నాపూర్‌లో వెలిసిన మహిబూబ్‌సుహాని ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రాత్రి భారీ ఊరేగింపుతో గంధోత్సవం, మంగళవారం కందూరు, భక్తుల మొక్కులు, బుధవారం జాతర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కోస్గి ఎస్‌ఐగా బాల్‌రాజ్



కోస్గి: కోస్గి నూతన ఎస్‌హెచ్‌ఓ ఎస్‌ఐగా కే. బాల్‌రాజ్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో విధులు నిర్వహించి బదిలీపై కోస్గి వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నారాయణపేట డీఎస్పీ లింగయ్యను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలు పరిరక్షించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

జోరుగా రేషన్ బియ్యం దందా

మాగనూర్: ఒక వైపు జిల్లా అధికారులు అక్రమ దందాలపై ఉక్కు పాదం మోపాలని కింది స్థాయి అధికారులను ఆదేశిస్తుంటే, కొందరు మాత్రం తమకు అవేవి వర్తించవు అన్నట్లుగా వ్యవహరిస్తూ అక్రమ దందాలకు వత్తసు పలుకుతున్నారు. మండలంలో పలు గ్రామాల్లో రేషన్ బియ్యం దందా జోరుగా సాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పేదలకు కోసం ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు వ్యాపారులు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి సేకరించి ఎక్కువ లాభాలకు కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నారు. దీనికి అధికారుల సహకారం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా రేషన్ బియ్యం దందాపై ఉక్కుపాదం మోపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక


బసంత్

నారాయణపేట రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న 39వ జాతీయ స్థాయి సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా నుంచి బసంత్ ఎంపికైనట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రమణ తెలిపారు. ఈ సందర్భంగా బసంత్‌కు అభినందనలు తెలియజేశారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఊరేగింపు





మరికల్‌లో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు.. మక్తల్‌లో వాసవీమాతను ఊరేగిస్తున్న భక్తులు

మక్తల్: విజయదశమి ఉత్సవాల సందర్భంగా మక్తల్ పట్టణంలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన వాసవీమాతకు ఊరేగింపు నిర్వహించారు. మహిళలు దాండియా నృత్యాలు, కోలాటం, డ్యాన్స్‌లు, చెక్కభజనలు, బతుకమ్మలతో తరలించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కె.శ్రీనివాస్‌గుప్తా, కమిటీ అధ్యక్షుడు కట్టసురేష్ పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహం తరలింపు

మరికల్: మండల కేంద్రంలో వివిధ రూపాల్లో పూజలు అందుకున్న దుర్గాదేవిని భక్తిశ్రద్ధలతో నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హరీష్, సూర్యప్రకాష్, శ్రీనివాసులు, కృష్ణచారి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'కార్యదర్శిని సస్పెండ్ చేయాలి'



ఎంపీడీఓకి వినతి పత్రం సమర్పిస్తున్న బీసీ ఐక్య వేదిక నాయకులు

మరికల్: మండలంలోని తీలేర్‌లో తాగునీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేయాలని బీసీ ఐక్యవేదిక నాయకులు సోమవారం ట్రైనీ కలెక్టర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ గరిమ నరులకు వినతిపత్రం సమర్పించారు. తీలేర్‌లో పది రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా అధ్వానంగా మారిందని, చాలా రోజులుగా నీటి సరఫరా లేదన్నారు. దసరా పండుగ రోజు వృద్ధురాలు నీళ్ల కోసం ఇంటి ముందున్న కుళాయి దగ్గరకు వెళ్లి విద్యుదాఘాతంతో మృతి చెందిన విషయాన్ని ఎంపీడీఓకు తెలిపారు. నీళ్ల సంక్రమంగా సరఫరా చేసి ఉంటే వృద్ధురాలు బతికేదన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన కార్యదర్శిపై విచారణ చేసి సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక సంఘం నాయకులు రాజు, లింగంగౌడ్, తిరుపతయ్య, ఆంజనేయులు, పరశురాం, లక్ష్మన్న, ఆశన్న, బాలకృష్ణ పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు ఘన సన్మానం



సన్మానం పొందుతున్న నూతన ఉపాధ్యాయులు

దామరగిద్ద: ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయ పోస్టులు సాధించిన ఉపాధ్యాయులకు స్థానిక ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శాలువా, పూల దండలతో అభినందన సభ నిర్వహించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి యూటీఎఫ్ రాష్ట్ర అడిట్ కమిటీ సభ్యుడు రఘుపాల్ హాజరై మాట్లాడారు. నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలోకి వస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. యూటీఎఫ్ ఉపాధ్యాయ సమస్యల పట్ల నిరంతర పోరాటం చేస్తుందన్నారు. అధ్యయనం, ఆధ్యాపనం, సామాజిక స్పృహ అనే లక్ష్యాలతో ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, కోశాధికారి భీమయ్య, జిల్లా కార్యదర్శి రవికుమార్, నరేష్, మోహన్, నూతన ఉపాధ్యాయులు వెంకటేష్, వెంకటప్ప, సంధ్య, గోదావరి, అశోక్, బాలు, గోపాల్, చెన్నప్ప, అంజిలప్ప ఆనంద్, శివరాజ్, అఖిల్‌కుమార్, అలీ, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఉదార స్వభావం



నగదు ఉన్న బ్యాగును బ్యాంకు ఉద్యోగికి అందజేస్తున్న తీలేర్ యువకుడు

మరికల్: ఓ బ్యాంకు ఉద్యోగి బస్సులో డబ్బులున్న బ్యాగును పోగొట్టుకోగా, తీలేర్‌కు చెందిన యువకుడు ఆ ఉద్యోగికి అందజేసి తన ఉదార స్వభావం చాటుకున్నాడు. మహబూబ్‌నగర్ ఐసీఐసీఐ బ్యాంకులో క్లర్క్‌గా పని చేస్తున్న ఓ ఉద్యోగి ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు వచ్చేందుకు నారాయణపేటకు చెందిన డిలక్స్ బస్సు ఎక్కాడు. జడ్చర్ల బస్టాండ్‌లో బస్సు ఆగడంతో వాటర్ బాటిల్ కోసం బస్సు దిగాడు. ఆ వెంటనే బస్సు మిస్ అయింది. వెంటనే మరో బస్సులో మహబూబ్‌నగర్‌కు వచ్చినా బస్సు దొరకలేదు. మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో బాధిత ఉద్యోగి పడుతున్న ఆవేదన గమనించిన రమేష్ అనే వ్యక్తి వివరాలు తెలుసుకున్నాడు. వెంటనే తీలేర్‌కు చెందిన స్నేహితుడు కమ్మరి బాలకృష్ణకు సమాచారం అందించాడు. వెంటనే మరికల్ చౌరస్తాలో బస్సును నిలిపి బ్యాగును తీసుకున్న విషయాన్ని తన స్నేహితుడికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. బాధిత ఉద్యోగిని దేవరకద్రకు పిలిపించి బ్యాగును అందజేశారు. బ్యాగుల్లో నగదు, రెండు ల్యాప్‌ట్యాప్‌లు ఉన్నాయి. బ్యాగు అందజేసిన బాలకృష్ణను అక్కడి వారు అభినందించారు.

దాతల సహకారంతో సరస్వతి ఆలయ నిర్మాణం



చివరి దశకు చేరిన సరస్వతి ఆలయం పనులు

మరికల్: దాతల సహకారంతో నిర్మిస్తున్న సరస్వతి ఆలయ నిర్మాణ పనులు చివరి దశకు చేరాయి. రూ.25 లక్షలతో నిర్మిస్తున్న ఆలయం పనులను తమిళనాడుకు చెందిన చిత్రకారులతో నిర్మిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు దుబాయ్ రాములు తెలిపారు. జిల్లాలోనే మొదట మరికల్ పట్టణంలో సరస్వతి ఆలయం నిర్మించడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. దాతలు సహకరిస్తే మరో రెండు నెలల వ్యవధిలో పనులు ముగించి అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించి ప్రారంభిస్తామని తెలిపారు.

ప్రశ్నించే గొంతుకలపై ఉక్కుపాదం



సాయిబాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు

అమరచింత: హక్కులపై ప్రశ్నిస్తున్న మేధావుల గొంతుకలపై బీజేపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం వామపక్ష భావజాలం గల మేధావులు, కవులు, కళాకారులు పోరాడుతున్నారన్నారు. వారిని వామపక్ష తీవ్రవాదులుగా ముద్ర వేసి ఉపా చట్టం కింద జైల్లో పెట్టి వారి చావులకు కారణం అవుతున్నారని మండిపడ్డారు. సాయిబాబా ప్రొఫెసర్‌గా సమాజానికి మేధావులను, విద్యావంతులను అందించారని కొనియాడారు. ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయంపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు అబ్రహం, భాస్కర్‌లతో పాటు కుతుబ్, రవీందర్, శ్యాంసుందర్, ఎర్రన్న, సోలు తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఆత్మకూర్: ప్రశ్నించే గొంతుకులను పాలకులు అక్రమంగా నిర్బంధిస్తూ అణగదొక్కుతున్నారని, కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తుందని సీపీఎం రాష్ట్ర నాయకుడు మహమూద్, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, సీపీఐఎంఎల్ జిల్లాకార్యదర్శి ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక గాంధీచౌక్‌లో ప్రొఫెసర్ సాయిబాబ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాబర్టు, సీఎస్ శెట్టి, లక్ష్మీనారాయణ శెట్టి, కుతుబ్, మోషె, వెంకటన్న, కుర్మన్న, భరత్ తదితరులు ఉన్నారు.

కాళికాలయంలో అన్నప్రసాద వితరణ



అమరచింత: మండల కేంద్రంలోని శ్రీకృష్ణనగర్‌లో వెలసిన కాళికామాత ఆలయంలో సోమవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. దేవీనవరాత్రుల సందర్భంగా అమ్మవారికి వడి నింపిన బియ్యంతో భక్తులకు అన్నప్రసాదంగా అందించామని ఆలయ నిర్వాహకులు కొట్టం నాగేశ్వర్‌రెడ్డి, తాటికొండ రమేష్ తెలిపారు. అదే విధంగా అమ్మవారి చీరలను వేలం పాటలో మహిళలు దక్కించుకున్నారన్నారు.

గ్యార్మీ ఉత్సవాలు ప్రారంభం



అమరచింత: పట్టణంలోని మహబూబ్ ఉస్సేనీ దర్గా షరీఫ్ ఉర్సోత్సవాలు సోమవారం సోమవారం గంధోత్సవంతో నిర్వాహకులు జిలాని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉర్సోత్సవాల సందర్భంగా మంగళవారం దర్గా వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపడుతున్నామని, భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు కళాశాలలకు వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు భరత్, నందు, ఈశ్వర్, రాము, ప్రవీణ్, శివ, సాయి తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో కాయిన్‌మేళా

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం మెట్టుగడ్డలోని యూనియన్ బ్యాంక్ శాఖలో సోమవారం రూ.10ల నాణేల మేళా నిర్వహించి పంపిణీ చేశారు. మేళాలో బ్యాంక్ రీజినల్ హెడ్ ఆర్.సత్యనారాయణ, డిప్యూటీ రీజినల్ హెడ్ శ్రీనివాస్‌మూర్తి పాల్గొన్నారు. రూ.10 నాణేలు చట్టబద్ధమైనవని, వీటిని రోజువారీ లావాదేవీలకు ఉపయోగించవచ్చని ఆర్‌బీఐ అధికారులు స్పష్టం చేసినట్లు తెలిపారు. రూ.10నాణేలు అవసరమైనవారు మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ శాఖలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ అమిత్ సాహు పాల్గొన్నారు.



సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిద్దాం



ఊట్కూర్‌లో బహిరంగ సభలో మాట్లాడుతున్న విభాప్రచారక్ దేవేందర్‌రాజు

ఊట్కూరు: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు కృషి చేద్దామని ఆర్ఎస్ఎస్ రిబాబ్ ప్రచారక్ దేవేందర్‌రాజు అన్నారు. ఊట్కూరులో సోమవారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన స్వయం సేవకులతో పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. అనంతరం జూనియర్ కళాశాల మైదానంలో బహిరంగ సభ నిర్వహించి మాట్లాడారు. సంస్కృతి, సాంప్రదాయాలను పటిష్ట పరిచే సాధనాలు పండుగలన్నారు. దేశంలో కుల వృత్తులు ఆదరణ కోల్పోవడం వల్ల ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకోలేకపోతున్నారన్నారు. కుటుంబ వ్యవస్థ పటిష్ట పర్చాల్సిన అవసరం ఉందన్నారు. నారాయణపేట, ఊట్కూరు మండలాల నుంచి 500 మంది స్వయం సేవకులు ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆదిత్యపరాశ్రీ, రాంరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఆర్ఎస్ఎస్ నాయకులు నర్సింగప్ప, కేశరావు, లక్ష్మన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభలో పాల్గొన్న స్వయం సేవకులు

విలీన సభను విజయవంతం చేద్దాం



అప్పిరెడ్డిపల్లిలో వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: ఈ నెల 20న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించే విలీన సభ వాల్‌పోస్టర్‌ను సోమవారం మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి బి నరసింహ మాట్లాడుతూ దేశ జనాభాలో 45 కోట్ల కార్మికులకు గాను, కేవలం 6 కోట్ల మంది మాత్రమే సంఘటిత రంగంలో ఉన్నారన్నారు. మిగతా 39 కోట్ల మంది అసంఘటిత కార్మికులు దరిద్రంలో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలు, నరసింహ, కతలప్ప, నాగప్ప, మల్లేష్, లాలు, నగేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ ఉపాధ్యాయులతో విద్యార్థులు

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2011–12 పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా బుద్ధులు నేర్పిన పూర్వ ఉపాధ్యాయులను శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ జీహెచ్ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు కృష్ణయ్య, రామకృష్ణ, బాల్‌రాజ్, బాలకిష్టప్ప, లక్ష్మన్, మాణిక్యప్ప, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న కౌన్సిలర్ మహేష్

నారాయణపేట రూరల్: దసరా పండుగను పురస్కరించుకొని నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు సోమవారం కౌన్సిలర్ మహేష్ ఆధ్వర్యంలో బహుమతుల ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ.12,222, రెండవ బహుమతి రూ.6,666 నగదును అందజేశారు. కట్టమ్మ, మైసమ్మ గుడుల దగ్గర బతుకమ్మ ఆడినవారికి, బతుకమ్మను రంగురంగుల పువ్వులతో అలంకరించి ప్రతిభ కనబర్చిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. మహిళలకు డ్యాన్స్ ప్రోగ్రామ్ నిర్వహించి బహుమతులు అందజేశారు. అదేవిధంగా వార్డుకు చెందిన ప్రతి మహిళకు రెండు రవికలు, గాజులు, తమలపాకు, అరటిపండు, వక్కలు పంపిణీ చేశారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు



ముఖ్యమంత్రిని కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు

మద్దూరు: ఉమ్మడి మద్దూరు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి మద్దూరు మండలంలో చేపట్టే అభివృద్ధి పనులు, ఇప్పటి వరకు జరుగుతున్న పనులను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కొత్తపల్లి మండలంలో ప్రభుత్వ భవనాల మంజూరు, మద్దూరు పట్టణంలో రోడ్డు విస్తరణ, ఇతర రోడ్ల విస్తరణకోసం నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



బిజ్వార్‌లో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ఊట్కూరు: రాష్ట్ర ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అఖిలభారత రైతు కూలి సంఘం మండల అధ్యక్షుడు చెన్నరాములు కోరారు. సోమవారం బిజ్వార్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు పేర్కొన్నారు. ప్రైవేట్ వ్యాపారులు పత్తి పంటకు సరైన ధర చెల్లించడం లేదని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేపట్టి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంజప్ప, గోవిందు, చిన్నబాలు, రవీందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

మాజీ జెడ్పీటీసీ కుమారుడి మరణం బాధాకరం



డాక్టర్ రిషికేషి పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మాగనూర్: మండల తాజా మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య రెండో కుమారుడు డాక్టర్ రిషికేషి(34) ఆకస్మిక మృతి చాలా బాధాకరంగా ఉందని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన కోల్పూర్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబానికి అని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, ఈశ్వర్‌యాదవ్, తదితరులు ఉన్నారు.